
# ఆ గూటి గోరింక

లాడ్జిలో రూం తాళంతీసి లోపలికి నడిచాను. మెత్తని తివాచీ. తివాచీ కింద ఫోమ్ పెట్టారు కాబోలు, అడుగుపడుతోంటే తివాచీ వినయంగా వంగుతోంది. రెండడుగులు వేస్తే చిన్న టీపాయ్. పక్కన డ్రెస్సింగ్ టేబిల్ పైన నిన్న చదివి పారేసిన డెయిలీ పేపరు. మరో పక్క ముడుచుకొని కూర్చున్న ఈ రోజు పేపరు. వేలకొద్దీ రహస్యాల్నీ, నామాల్నీ, చిరునామాల్నీ, సరైన నంబర్లనీ, రాంగ్ నంబర్లనీ దాచుకొంటూ ఏమీ ఎరగని ముఖం పెట్టి నిలిచిన టెలిఫోన్ డైరక్టరీ మరో పక్క – పైన నిగనిగలాడుతూ ఉన్న నిలువెత్తు బెల్జియం గ్లాస్ అద్దం – ఎదురుగా మంచం.

అలా రూం లోపలికి నడిచాను.
రూం నిన్న ఇలాగే ఉంది.
ఈ రోజూ ఇలాగే ఉంది.



రేపు-రేపు కాకపోతే ఎల్లుండి - ఏదో రోజున నేను ఇది ఖాళీచేసి వెళ్లిపోయిన రోజునా ఇలాగే ఉంటుంది కాబోలు! లోపల ఉండే యజమానిని బట్టి కొంత అటూ ఇటూగా - ఈ రూం జీవితం అంతే!

నెమ్మదిగా అడుగులో అడుగు వేస్తూ నడిచాను. మంచం మీద వాలాను. పైన సీలింగ్ ఫ్యాను ఉంది. కానీ తిరగటం లేదు. నాలాగే దాని రెక్కలూ ఎటూ ఆడక నిశ్చలంగా...

ఎలా ఉంటున్నాను ఇక్కడిలా? - తెలీదు. ఇంత ఒంటరితనం నన్ను ఇలా అదిమి పెడుతోందేం? సతీషూ, శ్వేతా ఏం చేస్తూ ఉండి ఉంటారు??

దీపాలు పెట్టారు. కనుక ఇంటికి చేరి ఉంటారు. సరోజ పిల్లలు ఇద్దరికీ అన్నం తినిపించి ఉంటుంది. పిల్లలు తిని ఉంటారా? సరోజ మాట వినే ఉంటారా? - తెలీదు, ఎప్పుడూ ఇలా జరగలేదు మరి!!

'ఆ తర్వాత...' అంటూ అడిగే శ్వేతా, 'అన్నం తింటూంటే తాతయ్యే చెప్తాడు గదా కథ!' అంటూ చెల్లెల్ని లాలించే సతీషూ... కథల్ని చెపుతూ, జోకుల్ని వడ్డిస్తూ, లాలిస్తూ అన్నం పెట్టే తను.

మరి... ఇలా ఇప్పుడు... ఇలా అయిపోయిందేం? ఆకలేస్తోంది. అన్నం గురించి ఆలోచించినందుకా? కాదు - మధ్యాహ్నం సైతం తినలేదు తను. ఆకలికి ఆగగలిగే వయసు కాదు, ఆ స్థోమతా లేదు. వెళ్ళి అన్నం తినొస్తే.... పోనీ తెప్పించుకొంటే... చెయి జాపి బేరర్ కోసం బెల్ నొక్కాను.

తను అన్నం తినగలడా? పిల్లలు తిని ఉంటారా? - కాకపోతే తనకోసం బెంగపెట్టుకొని అన్నం మానేసి ఉంటారా? ఏమో - దుడుకు పిల్లలు. అల్లరి పిల్లలు. 'మాంఛి' పిల్లలు! పక్కమీంచి లేచి వెంటనే పారిపోతేనో...

"సార్..." బేరర్ అతి నెమ్మదిగా లోపలికి వస్తూ అడిగాడు.

"ఊ..." ఆలోచనల్లోంచి తేరుకొంటూ అన్నాను - "వెళ్ళి ఓ కాఫీ పట్రా - వేడిగా స్ట్రాంగ్‌గా ఉండాలి".

బేరర్ వెళ్ళిపోయాడు చాలా మామూలుగా ! తనూ అంత తేలికగా వెళ్లిపోగలిగితే... కుదరదు! - ఆ పని జరిగేది కాదు.

కష్టమో, నష్టమో, బాధో, ఆనందమో.... ఏదైనా సరే ఇక తిరిగి ఇంటికి వెళ్ళేది లేదు. సరోజ... చిన్నపిల్లే! నిజమే - కానీ తనను ఎంతలేసి మాటలు అనేసింది! చిన్న పిల్లేం ఖర్మ. ఇద్దరు పిల్లల తల్లి! ఇంకా చిన్నతనం తెలియనితనం ఏం? తెలిసి తెలిసే అంది. గుండెల్లో ఎంత కాలం నుంచి విషాన్ని నింపుకొంటూ గడిపిందో అదంతా ఒక్కసారి కక్కేసింది.

తను భరించలేకపోయాడు. తను భరించలేదు. అందుకే వచ్చేశాడు తను! గది వదలి, ఇల్లు వదిలి ఇలా ఒంటరితనానికి బందీ కావటానికి... మదిలోంచి పిల్లలపై మమకారాన్ని దులిపి-ఇలా ఒంటరితనానికి బందీ కావటానికి...!

"కాఫీసార్..."

వేడి కాఫీ తాగాను. మళ్ళీ ఆలోచనలు...

ఆలోచనల బాధను తప్పించుకోవటానికి బయటకు వచ్చాను. తలుపు దగ్గరికి లాగి, నెమ్మదిగా లౌంజ్‌లోకి నడిచాను. లాంజ్‌లో ఉన్న సోఫాలో శరీరాన్ని వాల్చాను.

ఆలోచనలను తప్పించుకొనే ప్రయత్నాలలో ఉండగానే... ఎవరో బాగా తెలిసిన వ్యక్తే లిఫ్టులోంచి నడుస్తూ లాంజ్ మీదుగా... నా ముందునుంచే...

ఎవరది?

బాగా పరిచయం ఉన్న వ్యక్తే. ఎక్కడ చూశానబ్బా... తెలీటం లేదు. గుర్తుకు రావటం లేదు.

మళ్లీ ఆలోచించాను.

ఎవరో బాగా పరిచితులే. చాలాసార్లు చూసిన గుర్తే. కలిసి మాట్లాడిన గుర్తే. కానీ ఎక్కడ? ఎక్కడ??

మెదడులోపలిపొరల్లో ఎక్కడో తారాడుతున్నాడు. కానీ అంతు చిక్కడం లేదు. పోనీ వెళ్ళి అడిగేస్తే... అది మంచి పని. దానివల్ల ఆలోచనల బాధ తప్పుతుంది. పాత మిత్రుడిని కలుసుకున్న తృప్తీ ఉంటుంది. కదిలాను. లౌంజ్‌లోంచి నెమ్మదిగా అతని గదికేసి.

తలుపు దగ్గరగా వేసి ఉంది. తట్టబోతోంటే అతని పేరు తట్టింది. ఒక తలుపు తీయబోతే మరో తలుపు తెరుచుకుంది. తలపుల పొరల్లో దాగిన వ్యక్తి క్షణంలో ముందుకొచ్చాడు.

అతను రాజశేఖర మూర్తి! నాకు బాగా తెలిసిన వ్యక్తే. చాలాసార్లు చూశాను అతన్ని – అదీ నిజమే. కానీ అతనికి నేను తెలీదు. నేను అతనితో ఎప్పుడూ స్వయంగా మాట్లాడనూ లేదు. అదీ నిజమే! రాజశేఖర మూర్తిని ఒక్క నేనేమిటి, యావత్ తెలుగు ప్రజలు ఎరుగుదురు. అతన్ని అందరూ చూసే ఉంటారు. ఈనాడంటే ఇలా ఉన్నాడు కానీ – ఒకప్పుడు తెలుగు ప్రజల హృదయాల్ని ఏలిన నటుడు అతను. వందల సంఖ్యలో చలనచిత్రాల్లో నటించి, చివరకు వృద్ధాప్యం శరీరంలో ప్రతి అవయవాన్నీ ఆక్రమిస్తున్న క్షణాల్లో రిటైరయినాడు. నాలుగైదు థియేటర్లు, ఒకటో రెండో స్టూడియోలు, పదోపన్నెండో భవనాలు ఉన్న కోటీశ్వరుడు.

అవునూ.. అతనేమిటి ఇలా ఇక్కడ ఈ డబ్బా హోటల్లో... ఆఖరికి నా పొరుగుగా.

ఊహించనిది! ఊహలకన్నా, నిజం ఒక్కోసారి అందంగా, ఆశ్చర్యంగా ఉంటుంది కాబోలు!! అతని కాల్‌షీట్ అనుకోకుండా లభించడం నాకెంతో ఆనందంగా ఉంది. తలుపు మీద చిన్నగా టాప్ చేశాను. రెండు మూడు నిమిషాల తర్వాత కాబోలు 'కమిన్' అన్న మాట వినబడింది. లోపలికి అడుగు పెట్టాను.

కోటీశ్వరుడు ఉంటున్న గదిలోకి తొంగి చూశాను. మెత్తని తివాచీ, తివాచీ కింద ఫోమ్. టీపాయ్, డ్రెస్సింగ్ టేబిల్, ఈనాటి దినపత్రిక, టెలిఫోన్ డైరక్టరీ, బెల్జియం గ్లాసు అద్దం, మంచం మీద రాజశేఖర మూర్తి.

మంచం మీద వ్యక్తి తప్ప మిగతా గదంతా ఒకేలా ఉంది. ఎటొచ్చీ టీపాయ్ మీద రెండు పెద్ద సీసాలు.

ఇంత బీద ప్రపంచంలోకి రాజశేఖరమూర్తి ప్రవేశించటం ఏమిటి? రాజకుమారుడు మారు వేషం వేసుకొని దేశ దేశాల పర్యటనలు చేశాడని గతంలో తాను సతీష్, శ్వేతలకు ఎన్నో కథలు చెప్పాడు. ఆ కథలకు ప్రత్యక్ష సాక్ష్యం ఇదా?

గతంలోంచి వర్తమానంలోకి వస్తూ "నమస్కారం" అన్నాను.

రాజశేఖరమూర్తి ముఖంలో ఎన్నో ప్రశ్నలు. అన్నిటికీ ఒకటే పునాది - 'ఎవరు మీరు' అనేదే!

"మీరు నాకు బాగా తెలుసు. ఎటొచ్చీ మీరే నన్ను ఎరుగరు!"

"ప్లీజ్.." అంటూ ఎదురుగా ఉన్న కుర్చీ చూపిస్తూ అన్నాడు. "రండి, కూర్చోండి"

కూర్చుంటూ అన్నాను "మిమ్మల్ని కలుసుకోవటం అనేది నేనూహించని పరిణామం! అయాం గ్లాడ్".

క్షణం తర్వాత నేనే అన్నాను "ఎన్ని సినిమాలు, ఎన్ని పాత్రలు... అయామ్ ఏ ఫాన్ ఆఫ్ యువర్స్".

రాజశేఖరమూర్తి అసహనంగా అన్నాడు "ఏమీ అనుకోకండి, సినిమాల గురించి కాక ఇంకేదయినా, మాట్లాడండి. పెద్దవారు మీరు, ఇలా అన్నానని ఏమీ భావించొద్దు."

రాజశేఖర మూర్తి వయసు అరవైదాటి ఉండొచ్చు. నా వయసు అరవైకి ఇంకా చాలా తక్కువే. కానీ మీరు పెద్దవారు అంటున్నాడతను. అది అతను ధరించిన పాత్రల ప్రభావం కాబోలు! అయినా తనకూ అలాగే కనిపిస్తున్నాడతను!

"మీరు పక్క రూంలో ఉంటున్నారా?"

"కాదండి. ఆ పక్కరూంలో..." అని ఆగాను. ఇంకేం మాట్లాడాలి? అతనితో నాకుండే బంధం ఒక్కటే. అతను నటుడు, నేను అభిమానిని.

అదొక్కటి వద్దన్నాడు. మరి నాకిక మాటలు లేవు.

"ఏం చేస్తుంటారు?"

చెప్పాను - ఏమీ చెయ్యనని. రిటైర్ అయి రెండు మూడేళ్ళు అయింది. ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌తో జీవనం అని.

"ఏ ఊరు?"

చెప్పాను - ఇదే నా ఊరని!

"మరి లాడ్జిలో ఉండటమేం?"

చిన్న ప్రశ్న. సరైన ప్రశ్న. ఉన్న ఊరిలోనే లాడ్జిలో ఉండటం ఏం ఖర్మ? ఏ అబద్ధం చెప్పాలి? అబద్ధం చెప్పటం ఇంత కష్టమా? ఏదో ఒకటి... గోడో, తడికో ఏదో ఒక అబద్ధం... ఏది తట్టదేం? చెప్పలేకపోయాను - అతనంటే ఉన్న అభిమానం కాబోలు, ఎన్నాళ్లనుంచో ఎదలో ఎదిగిన గౌరవం కాబోలు, నా చేత నిజం చెప్పించాయి.

"నేను ఇంట్లోంచి పారిపోయి వచ్చాను"

రాజశేఖరమూర్తి ఆశ్చర్యపోయాడు. అతని ముఖంలో ప్రశ్నల చిహ్నం.

మరో ప్రశ్నను ఆహ్వానించక, ఆ శ్రమ ఇవ్వక చెప్పాను. "రెండు మూడేళ్ళక్రితం జీతం వెయ్యివరకూ అందేది. అన్ని రకాల కోతల తర్వాత, మీకు తెలీదు కానీ వెయ్యి రూపాయల జీతం అంటే మాకు చాలా గొప్ప..." ఆగాను.

"చెప్పండి.. నాకు తెలుసు రూపాయల విలువ!" అని ఆగి నెమ్మదిగా అన్నాడు. "నాకు అందిన మొదటి జీతం ఎంతో తెలుసా? రెండు రూపాయలన్నర!" నవ్వాడతను.

నేనూ నవ్వాను. రెండు రూపాయలున్నర ఇపుడో రెండు కోట్లకు చేరిందా? ఇంకా ఎక్కువే ఉండి ఉంటుంది కాబోలు!!

అంచనా సైతం చేతకానంత బీదతనం నాది!

"వెయ్యి రూపాయలు చేత పడ్డంతకాలం నా జీవితం గొప్పగా ఉండేది. రిటైరయ్యాక జీతం - పింఛను రూపం దాల్చింది. వెయ్యి కాస్తా నాలుగొందలయింది ఇంట్లో పరిస్థితీ క్రమంగా మారింది!"

"సరిపోదుకదా మరి!"

"అహ, అది కాదండి! ఇంట్లో నాకున్న గౌరవం గురించి చెప్తున్నాను. జీతం తగ్గాక, ఇంట్లో నా స్థితే మారింది. కానీ అది తెలిసేసరికి ఇన్నాళ్ళయింది! కొడుకుకు నేను నిజంగా తండ్రినే అయినా, కోడలు తన తండ్రిలా చూసుకొనేది. కానీ డబ్బు ఆదాయం తగ్గాక తండ్రిని కాస్తా మామగారినే అయ్యాను. బహుశా ఇపుడు అదీ కాదేమో!"

"అందుకని....?" రాజశేఖరమూర్తి అడిగారు.

"చెప్తున్నా నమ్మండి. రిటైర్ చేయించటం కన్నా ఫైర్‌స్క్వాడ్ ముందు నిలబెట్టి నాలుగు తూటాలు గుండెల్లో దింపేస్తే మంచిది. ఇంట్లో బతకటం కన్నా స్మశానంలో ఆరడుగుల నేలను ఆశ్రయించటం మేలు. అలా కాదంటారా? జీతం తగ్గించక, పింఛన్ పేరు పెట్టి అయినా అంతే మొత్తం ఇప్పించాలి!"

"క్షమించండి" అంటూ రాజశేఖర మూర్తి మంచం మీద నుంచి టీపాయ్ మీద ఉన్న ఓ సీసా అందుకొన్నాడు. గ్లాసులోకి ఆ ద్రవాన్ని వొంపుతూ అడిగాడు. "మీరు కొంచెం..."

"వద్దండీ - అలవాటు లేదు" అన్నాను సున్నితంగా.

"అలవాటు అయిపోయింది. ఇపుడిది లేకపోతే సుఖమూ లేదు. దు:ఖమూ లేదు. సుఖంలోనూ ఇదే తోడు, దు:ఖంలోనూ ఇదే ఓదార్పు! నేను తీసుకొంటాను! మీరు ఏమీ అనుకోనంటే....!"

ఫర్వాలేదు, తీసుకోండన్నాను. గ్లాసులో నాకోసం నింపింది తన గొంతులోకి వొంపుకున్నాడతను.

"చెప్పండి, చాలా తమాషాగా ఉంది మీ కథ!"

"కథ కాదు బాబూ, ఇది నిజం. నా జీవితంలో విషం! డబ్బు తగ్గింది. అటు ఆదరణ తగ్గింది. అందుకే ఇలా వచ్చేశాను".

రాజశేఖర మూర్తి పకపక నవ్వాడు.

ఇంత కొంచెం తాగితేనే ఇంత నిషాయా?

ఆశ్చర్యపోయాను.

పకపకా నవ్వుతూ దాన్ని ఉన్నట్లుండి ఆపుకొంటూ అన్నాడాయన.

"అంటే అంతా డబ్బు తగ్గటంవల్లనే జరిగిందంటారా?"

"ఖచ్చితంగానూ!" అన్నాను నేను.

అతను నవ్వాడు. "పోనీ, ప్రతి నెలా మీకు నేనో వెయ్యి రూపాయల చొప్పున ఇచ్చానే అనుకోండి. అపుడు మీ కష్టాలన్నీ తీరిపోతాయా?"

"నిస్సందేహంగా!" అనేశాను నిర్మొహమాటంగా.

గ్లాసులోకి ద్రవాన్ని ఒంపుకొంటూ రాజశేఖరమూర్తి నెమ్మదిగా అన్నాడు "మీరు చాలా పొరబడుతున్నారు! డబ్బున్నంత మాత్రాన మీ పరిస్థితులు బాగుంటాయని భావించటం తప్పని నా అభిప్రాయం!"

నవ్వాను. నవ్వుతూ అన్నాను నెమ్మదిగా "రాజశేఖరమూర్తిగారూ! డబ్బులో పుట్టి డబ్బులో పెరిగినవారు మీరు. రూపాయినోటుకు ఉన్న విలువ దేనికీ లేదన్న సంగతి మీకు అర్థంకాదు. మీరు అర్థం చేసుకోలేరు కూడాను!"

గ్లాసులో ద్రవాన్ని నెమ్మదిగా సిప్‌చేస్తూ "నిజమే. కోటీశ్వరుడినే నేను. ఎంత ఆస్తి ఉందో నాకే సరిగ్గా తెలీదు. కానీ... నిజం చెప్తున్నాను వినండి. నేనూ ఇంట్లోంచే పారిపోయి వస్తున్నాను. నా అనుకొన్న మనుషులందరి నుంచీ పారిపోయి వస్తున్నాను!"

నా పక్కలో ఎక్కడో బాంబు పేలినట్లుగా అనిపించింది నాకు.

నిజమా! నా జీవితానికి ప్రతిబింబమా ఇతని జీవితం?

కాకపోతే - వృద్ధులందరి జీవితమూ ఇంతేనా? వయసు మీరిన వారందరి బతుకూ ఇంత ఘోరమా? తర్వాత తరానికి ఇంత పనికిరాని వారమా?? మా తరం వెనుకబడిపోయి, ముందు తరాల్ని అర్థంచేసుకోలేకపోతోందో, కాకపోతే మేమే వారిని కాదంటున్నామో! అర్థం కావటం లేదు.

అయినా అదేం బాధ? అంత డబ్బు ఉంటే ఎంతగా శాసించగలమో కదా! పైగా అదంతా స్వార్జితం. రాత్రింబవళ్ళు వేషాలు వేసి కూడాబెట్టిన సొమ్ము. మరీ...

"మా వాళ్ళదో విచిత్ర కుటుంబం. అందరికీ నా డబ్బు కావాలి కానీ నేను అఖ్ఖర్లేదు. ఎవరు పలకరించినా, ఏం మాట్లాడినా అదెక్కడో ఓచోట డబ్బుకు ముడిపడి ఉంటుంది. అందుకే జీవితం అంటే అసహ్యం పుట్టి ఇలా పారిపోయి వచ్చేశాను."

మరి ఇలాంటి హోటల్‌లో తలదాచుకోవటం దేనికన్నాను నవ్వుతూ.

"మామూలుగా నేను ఎక్కడికి వెడతానో ఇంట్లో అందరికీ తెలుసు. వాళ్ళకు నా ఆచూకీ అసలు తెలీకూడదనే ఇలాంటి హోటల్‌ను ఎన్నుకొన్నాను. మూడు రోజులయింది ఇక్కడకు చేరి. ఈ మూడు రోజులూ ఎవరికంటా పడకుండా జాగ్రత్తా పడ్డాను. కానీ ఈ గదిలో ఒంటరిబతుకు ఇక బతకలేననిపించి ఈ రోజే సాయంత్రం అలా వెళ్ళితిరిగొచ్చాను. వస్తోంటేనే మీరు చూశారు కాబోలు!!"

అవునంటూ తల ఊపాను.

"ఈ రూంలోకాక ఇంకోటేదైనా అయితే మా వాళ్ళు వెతికిపట్టేసేవారు. లేని ఆప్యాయత అంతా ఒలకపోసి నన్ను లాక్కెళ్ళేవారు. ఇపుడూ ఆ పనే చేస్తుంటారు. పేరున్న హోటళ్ళన్నింటికి

పేరు పేరునా టెలిఫోన్లు చేసి ఉంటారు. వాళ్ళకు నిజంగా కావల్సింది నేను కాదు. నా విల్లు. అదొక్కటి వాళ్ళకు అందితే చాలు, నేను చావకపోయినా నా పేరును అబిచ్యురీ కాలంలో ప్రకటించేస్తారు. దౌర్భాగ్యులు!!"

నిజమే అనిపించింది నాకు.

"చెప్తున్నా వినండి! నిజానికి మనసుల్లో ఆప్యాయతే అసలైన సంగతి. డబ్బుది కాదండి - మీరు డబ్బులేక అనుకొన్నారు. కానీ నిజం అది కాదనేది నేను రుజువు చేస్తున్నాను!"

"ఆప్యాయతలనేవి చచ్చిపోయాయండి. అన్నింటికీ డబ్బుతో లంకె పెట్టడం కూడా నిజమే కానీ డబ్బులేని ఎందరో సుఖంగా, సంతోషంగా తమ పెద్దాళ్ళతో కలిసి లేరా చెప్పండి!"

"విలువలన్నీ మారిపోయాయి. ఎవర్నుకొని ఏం లాభం? ప్రొటెస్ట్ చేస్తాం. కానీ ఆ నిరసనవల్ల ఏం లాభం ఉంటుంది చెప్పండి. ఎన్నాళ్ళిలా? వారం రోజులు, పదిరోజులు - ఆ తర్వాత... మళ్ళీ బహుశా ఆ కూపంలోకే - వాళ్ళు నన్ను కోరరని తెలిసినా వెళ్తానేమో! ఎందుకంటే వాళ్ళకు నేను అఖ్ఖర్లేదు. కానీ వాళ్ళను నేను కన్నాను. వాళ్ళు నాకు కావాలి! అందుకే..."

ఆవేశం పట్టలేక కాబోలు, ఈ సారి సీసానే ఎత్తి గొంతులోకి వొంపుకొంటున్నాడు.

ఎన్ని పాత్రలు పోషించి సాధించుకొన్న అనుభవమో అది!! అక్షర రూపంలో జీవిత సత్యాలను అందిస్తున్నాడు.

నిజమే - వాళ్లు... వాళ్లంటే ఎవరు? ఒక్క సరోజే కదా... చిన్న పిల్ల! ఆ అమ్మాయి తన్ను ఏదో అందని ఇలా వచ్చేయటం. అంటే.. వాళ్ళంటే తనకూ అభిమానం లేనట్లే కదా? లేదా??

కొడుకు శేషాచలంపైనా, మనుమడు సతీషు, మనుమరాలు శ్వేత - ఉహూ తప్పు, అయినా సరోజ మాత్రం ఇన్నేళ్లు తన్ను ఎంతగా కళ్లలో పెట్టుకొని కాచుకొందో!

చాలు - ఈ రెండు రోజుల శిక్ష చాలు నాకు, నా జీవితానికి - నా తెలివి తక్కువ తనానికి, నా జీవితం నాకు ఇవ్వలేని అనుభవానికి!!

రాజశేఖరమూర్తి ఇంకా ఏదో అంటున్నాడు. నా అభిమాన నటుడు నాకు జీవితంలో ఎంత మేలు చేశాడు!! అతను నా దృష్టిలో మరింత ఎదిగాడు.

సెలవు తీసుకొని నా గదిలోకి వచ్చాను. ఈ నరకకూపంలో ఇక ఉండలేను. బట్టల్ని సద్దుకుంటూ బెల్ నొక్కాను - బాయ్‌కోసం.

రాగానే అడిగాడు బాయ్ "రూం ఖాళీ చేస్తున్నారా సార్? బిల్లు, టాక్సీ తేనా? స్టేషన్‌కా, బస్ స్టాండుకా?"

నవ్వాను - ఈ సారి ప్రయాణం స్టేషన్‌కూ కాదు, బస్‌స్టాండ్‌కూ కాదు. మనసులో చిందులు వేస్తున్న నా మనుషుల దగ్గరికి!!

- విపుల, ఫిబ్రవరి, *1981*